వాడవాడలా అరుణ పతాక రెపరెపలు

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా గురువారం పట్టణంలో అరుణ పతాకాలు రెపరెపలాడాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కూడళ్లు, ఫ్యాక్టరీలలో అరుణ పతాకాలను ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏఐటీయూసీ, సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, న్యాయవాది సి.జే.ప్రతాప్ అరుణ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నాయకుడు ముప్పాళ్ల కోటేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించగా, సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్‌లు చిత్రాలయ సెంటర్, ఆయిల్ మిల్లుల వద్ద అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర బిజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను ఏర్పాటు చేసి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెట్టేలా ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఈసందర్భంగా అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయం వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

వినుకొండలో...

వినుకొండ: ఏఐటీయూసీ వినుకొండ ఏరియా అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడేను పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వారివారి ప్రాంతాల్లో మేడే జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు రోజుకు 18 గంటలు పనిచేయుచు బానిస బ్రతుకులు వెళ్లదీస్తూ శ్రమదోపిడీకి గురయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంద్రపాటి సైదా, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, చిన్న, వందనం, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ ఆయా యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం, భవిష్యత్ ఉద్యమాల కు సిద్ధంగా ఉండాలని మండల సీఐటీయూ అధ్యక్షుడు గల్లా సీతారామయ్య పిలుపునిచ్చారు. నూజెండ్ల బస్టాండ్ సెంటర్‌లో మే డే పురస్కరించుకుని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు అరుణ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సలోమి, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, రైతు సంఘం నాయకులు ఆశీర్వాదం, సత్యనారాయణ, గోపీ పాల్గొన్నారు.

పలుచోట్ల ఎర్రజెండాలు ఎగురవేత

నరసరావుపేట: పట్టణంలో సీఐటీయు నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా మేడే దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మసెంటర్, పల్నాడురోడ్డులోని ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ఎర్ర జెండాలను ఎగురవేసి నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాయకులు డి.శివకుమారి, శిలార్ మసూద్, సాల్మన్ నేతృత్వంలో మున్సిపల్, ఆర్టీసీ కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


రొంపిచర్లలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐయూటీసీ నాయకులు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో...
మండలంలోని పార్వతీపురం గ్రామంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మేడే జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

యడ్లపాడులో కార్మికుల దినోత్సవం


యడ్లపాడులో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

యడ్లపాడు: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా యడ్లపాడు మండల కేంద్రంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడు మేడే సందర్భంగా పీఆర్ విజ్ఞాన కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం కూడలి వద్ద సీఐటీయూ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 'కార్మిక శక్తి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోంది. అనేక అనుబంధ సంఘాలు ఉన్నప్పటికీ, సమిష్టిగా ఉద్యమించినప్పుడే కార్మికుల హక్కులు సమర్థంగా సాధించగలమని'' పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత పోపూరి సుబ్బారావు, సీఐటీయూ నాయకులు కాట్రగడ్డ వెంకట్రావు, ఆర్.ఆంజనేయులు, రైతుసంఘం మండల నాయకులు జరుగుల శంకరరావు, బందెల పీటర్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకుడు కారుచోల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ మేడే అమరవీరుల స్ఫూర్తిగా ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దూపాటి నాని, అందుగులపాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక చెరువుకట్ట సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో అరుణపతాకమును సీపీఎం రొంపిచర్ల గ్రామ శాఖ కార్యదర్శి అంగులూరి ఫణీంద్ర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, సీపీఎం మండల నాయకులు పలపల రామిరెడ్డి, వెంకటప్పారెడ్డి, మీరా హుస్సేన్, భవనని ర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


పార్వతీపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు


మల్లమ్మ సెంటర్‌లో ..


నూజెండ్లలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: మండల కేంద్రంలో మేడే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా పార్టీలకు చెందిన పలువురు మాట్లాడుతూ అమెరికా దేశంలోని చికాగో పట్టణంలో అప్పట్లో కార్మికుల హక్కుల కోసం పోరాటాల ఫలితమే మేడే దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: మేడే స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని గురువారం సీపీఐ కార్యాలయం వద్ద, మున్సిపల్ కార్యాలయం, గాంధీపార్కు వద్ద మేడే పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని కావాలని, బానిసత్వం నుంచి విముక్తి, పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడి హక్కులు సాధించుకుందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మారుస్తూ కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలు మొత్తం ప్రైవేటు పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం పేద,మధ్య తరగతి వర్గాలపై గ్యాస్, డీజిల్ ధరలు పెంచుతూ మోయలేని భారం వేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు ముసాబోయిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్, కాసా సాంబయ్య, తుబాటి సుభాని, తాడిబోయిన సాంబయ్య, కొమరగిరి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.


చిలకలూరిపేటలో నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న న్యాయమూర్తి గాయత్రి

నరసరావుపేటటౌన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాలపై గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. గాయత్రి అసంఘటిత రంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచితంగా న్యాయ సహాయం పొందే విధివిధానాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, న్యాయ సహాయం తదితర అంశాలను వివరించారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత, వాటిని పొందే విధివిధానాలను, దరఖాస్తు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కార్మిక శాఖ సహాయ కమిషనర్, మున్సిపల్ అధికారులు, మొదటి పట్టణ పోలీసులు, కార్మిక సంఘ ప్రతినిధులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సర్దార్ కాసు వెంగళరెడ్డి 46వ వర్ధంతి



రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సర్దార్ కాసు వెంగళరెడ్డి 46వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న కాసు వెంగళరెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ సర్దార్ కాసు వెంగళరెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ గా వెంగళరెడ్డి జిల్లాలో ఉన్నత పాఠశాలల అభివృద్ధికి, ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రైతువిభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, కల్లి వెంకటప్పారెడ్డి, కల్లి వెంకటరెడ్డి, పలువురు కార్యకర్తలు, పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

బొల్లాపల్లి : మండలంలోని పేరూరుపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా గురువారం పింఛన్‌ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పింఛన్లు మంజూరు కొరకు పలువురు విన్నవించుకున్నారు.

క్లుప్తంగా

50 రాయితీపై సమీకృత దాణా

నరసరావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమీకృత దాణాను సరఫరా చేస్తున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే.కాంతారావు గురువారం తెలిపారు. 50 కేజీల దాణా సంచి పూర్తి ధర రూ.1110లు కాగా, ప్రభుత్వం రూ.550ల సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. రైతులు రూ.555లు చెల్లించి దాణా సంచిని పొందవచ్చని తెలిపారు. దాణా అవసరమైన పాడిరైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రం, పశు వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. భారత్ పశుధన్ యాప్‌లో పేరు నమోదు చేసుకున్న రైతులు, పశువులకు టీకాలు వేయించిన రైతులు సబ్సిడికి అర్హులని వివరించారు. తెల్లకార్డు కలిగి ఉన్న రైతులకు ప్రారంభంగా ఒక్కో రైతుకు ఒక్కో సంచి మాత్రమే అందిస్తామని తెలిపారు. మొదటి విడతగా జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయని ప్రిన్సిపాల్ బి. రవినాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ముప్పూరి వెంకట త్రిలోక్ నూటికి 93 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, నంబూరి లహరి 91 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ తెలిపారు. పరీక్షా ఫలితాలు పాఠశాల నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక జరుగుతుందన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థుల తుది జాబితాను డీఈవో జిల్లా కలెక్టర్‌ల అనుమతితో త్వరలో ప్రకటిస్తామన్నారు.

రైతులకు ఫాం (9) నోటీసులు పంపిణీ

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులకు సంబధించి రైతులకు ఫాం (9) నోటీసులు అందజేస్తున్నట్లు మండల సర్వేయర్ రాజు తెలిపారు. గురువారం కొత్తలూరు గ్రామ సచివాలయంలో రైతులకు నోటీసులు అందజేశారు ఈసందర్భంగా మాట్లాడుతూ రీసర్వే పనుల్లో భాగంగా రోవర్ ఆధునీకరణ యంత్ర పరికరం ద్వారా 4400 ఎకరాల్లో భూములు కొలతలు సరిహద్దులను గుర్తించామన్నారు. 3500 మంది రైతులను గుర్తించి ఫాం (9) నోటిసులు ఇస్తున్నట్లు తెలిపారు. భూముల కొలతలు ఎమైనా అభ్యంతరాలు ఉంటే 0.5 సెంట్లు దాటిన రైతులందరు తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తామన్నారు. ఆయనతో పాటు వీఆర్వో ఉప్పులూరి చినమంగయ్య రైతులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నరసరావుపేటటౌన్: క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ సీఐ హైమారావు గురువారం తెలిపారు. పెద్ద చెరువు 9వ లైనుకు చెందిన పల్లపు రాజ్యలక్ష్మి (30) ఎలుకల మందు సేవించి గత నెల 27వ తేదీన ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను పట్టణంలో ని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. .

గురుకుల సెక్రెటరీకి టీఆర్ఎఫ్ నేతల వినతి



వినుకొండ: ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి ఎం.గౌతమిని విజయవాడలోని ఆమె కార్యాలయంలో గురువారం ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణునాయక్‌తోపాటు, మరికొంత మంది కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో మౌలికవసతులు కల్పించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా సీట్లు పెంచాలని కోరారు. గౌతమిని కలిసిన వారిలో టీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌నాయక్, కోశాధికారి వెంకటేశ్వర్లు నాయక్, బాబు నాయక్, అప్పులఅప్ప నాయక్ పాల్గొన్నారు.

ప్రధాని సభను జయప్రదం చేయాలి

నాదెండ్ల: రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ రానున్నందున సభను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ సంజీవరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలం నుండి వెయ్యి మందిని 20 బస్సుల్లో తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు.

నాల్గవ రోజుకు చేరిన సీహెచ్‌వోల సమ్మె


నినాదాలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది

నరసరావుపేట: తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా గత సోమవారం నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) చేస్తున్న సమ్మె గురువారం కూడా కొనసాగింది. మండు వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు మధ్య జిల్లాలోని పలువురు సీహెచ్‌వోలు టెంట్‌ల కింద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమ్మెలో పాల్గొంటున్నారు. వీరిలో అత్యధికంగా మహిళలే ఉన్నారు. జిల్లాలో ఆయుష్మాన్‌భవన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ, ఉపాధ్యక్షులు కె.వినోద్ జిల్లా కో ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ జిల్లా తాము 361మంది పనిచేస్తున్నామన్నారు. తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తమకు 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. క్లినిక్ అద్దెబకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్టు అందజేయాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. పలువురు సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ హాస్పిటల్‌లో న్యూరాలజిస్టు సేవలు

కన్సల్‌టెంట్ డాక్టర్‌గా సౌమ్యను నియమించిన ఎండీ డాక్టర్ కారసాని

నరసరావుపేట: స్థానిక మహాత్మాగాంధీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో నరాల జబ్బులకు వైద్యసేవలు అందజేసేందుకు డాక్టర్ మేడబలిమి సౌమ్యను న్యూరాలజిస్టుగా నియమించినట్లు హాస్పిటల్ ఎం.డి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి గురువారం పేర్కొన్నారు. తమ వైద్యశాలలో గత రెండు నెలల నుంచి పూర్తిస్థాయి న్యూరాలజిస్టు అందుబాటులో లేనికారణంగా న్యూరాలజీ సేవలకు కొంత అంతరాయం ఏర్పడిందన్నారు. డాక్టర్ సౌమ్య గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆమెకు డాక్టర్ కారసాని దంపతులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈసందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గత 20ఏళ్ల నుంచి సూపర్ స్పెషాల్టీ సేవలు అందజేస్తున్న మహాత్మా గాంధీ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ న్యూరాలజిస్టుగా సేవలు అందజేయటం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. డాక్టర్లు డి.శ్రీకాంతప్రసాదు, ఏ.అశ్విని, వై.నవీన్, ప్రవీణ్, విజయరాజు పాల్గొన్నారు.


డాక్టర్ సౌమ్యకు స్వాగతం పలుకుతున్న డాక్టర్ కారసాని దంపతులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన మెరుగైన విద్య లభిస్తుందని హెచ్ఎం వి విజయలక్ష్మీ చెప్పారు. గణపవరం ఎంపీపీఎస్ మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం చిన్నారుల కోలాహలం నడుమ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ ఏడాది 170 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులతో పాఠశాలలో మెరుగైన విద్య, మంచి ఫలితాలు సాధించామన్నారు. అనంతరం టీచర్ కొప్పుల సంధ్య ఆధ్వర్యంలో 22 మంది చిన్నారులు నిర్వహించిన కోలాటం, భరత నాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, దాతలు బహుమతులు అందించారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తింపు

బొల్లాపల్లి: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించడం జరుగుతుందని ఐఈడీ కోఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్ గురువారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు కొత్తవారిని భవితా కేంద్రంలో చేర్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 123 మంది చిన్నారులు ఉన్నారని చెప్పారు. మూగచింతలపాలెంలో ఇరువురు చిన్నారులకు భవిత కేంద్రంలో ఈ ఏడాది ప్రవేశం కల్పించామన్నారు. ఈ రోజు నుంచి మండలంలో కొత్తవారిని గుర్తించి అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భవిత కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ శ్రీనివాస్, ఐఈఆర్‌టీఏ బాబురావు, ఎస్‌కే సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్ సెల్వరాజు అన్నారు. మండలంలోని రవ్వవరం గ్రామంలో చేపడుతున్న విభిన్న సామర్థ్యాలు కలిగిన పిల్లల గుర్తింపు ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సెల్వరాజు మాట్లాడుతూ విభిన్న అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం మండలంలో 40 రోజుల ప్రత్యేక నమోదు చేపడుతున్నట్టు తెలిపారు. విభిన్న అవసరాల పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వటం, ప్రభుత్వ సౌకర్యాలు వారికి అందేలా చేయటం ప్రదాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, యం.వి.రంగారావు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ స్వరాజ్యం పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులు సమీక్ష

నూజెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని విద్యా కమిటి చైర్మన్ ముప్పాళ్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాలో పదో తరగతి పరీక్ష ఫలితాలపై ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్గిలా నాణ్యమైన విద్యను అదించాలన్నారు. ఈవిద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు 120 మంది రాయగా 81 మంది ఉత్తీర్ణిత శాతం దిగువన ఉండటం భాదకరమన్నారు. భవిష్యత్‌లో మెరుగైన ఫలితాల కోసం 6వ తరగతి నుంచే వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.అలాగే త్వరలో జరగనున్న పదో తరగతి సప్లమెంటరి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణిత సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై మాట్లాడినారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చాలి

ప్రాజెక్ట్ డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చే దిశగా సిబ్బంది పనిచేయాలని ప్రాజెక్ట్ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పొలంలో ఖరీఫ్ పంట వేసే ముందుగా భూమిని ఖాళీగా ఉంచకుండా 30 రకాల విత్తనాలు బీజామృతంతో శుద్ధి చేసి పొలంలో చల్లాలని తెలిపారు. 45 రోజుల తరువాత భూమిలో కలయ దున్నడం వలన ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు అభివృద్ధి చెంది పంట ఆరోగ్యం,భూమి సారవంతం, పంట దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులు మొత్తం విస్తీర్ణంలో ఈ సాగు విధానాన్ని పాటించే విధంగా సిబ్బంది కృషిచేయాలని తెలిపారు. జిల్లాలోని 28 మండలాల్లో 222 వివో సంఘాలు పరిధిలో 132 గ్రామ పంచాయతీల్లో జీరో బడ్జెట నేచురల్ ఫార్మింగ్ విధానం కొనసాగుతుందని తెలిపారు. 2025–26 సంవత్సరంలో 82,619 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి సాగు లక్ష్యంగా విధించుకున్నట్టు తెలిపారు.


మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

ఒంటరి మహిళలను ఆదరించాలి

చిలకలూరిపేట: నిరుపేద ఒంటరి మహిళలను ఆదరించాల్సిన ఆవశ్యకత ఉందని అసిస్ట్ సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. అసిస్ట్, కేఎస్ఏ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన నిరుపేద ఒంటరి మహిళలను గుర్తించి బియ్యం, కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి వంటి నిత్యావసరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఎస్ఏ సంస్థ ప్రతినిధి అస్మా, అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ ఎం విష్ణుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

నరసరావుపేట టౌన్: ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరండల్‌పేట కాసుబ్రహ్మానందరెడ్డి కాంప్లెక్స్‌లో ఒక గుర్తుతెలియని శవాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అరుణ తెలిపిన వివరాల ప్రకార రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన ముత్తినేడి పెద్దబ్బాయిగా నిర్ధారణ చేశారు. వారి బంధువులకు ఫోన్ ద్వారా తెలియచేశామని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

బీమా ఉపయోగించుకోవాలి

నాదెండ్ల: ఉపాధి హామీ పథకం కూలీలు ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో చేరి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి బీమా పథకం ఉపయోగాలను కూలీలకు వివరించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకంతో బీమా పత్రాలు పూర్తి చేసి ఇవ్వాలన్నారు.